## క్లుప్తంగా

### కొనసాగుతున్న ఎస్‌డీజీ శిక్షణ


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న శిక్షణాధికారులు

**సామర్లకోట:** స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ)లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)పై శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని జిల్లాస్థాయి అధికారులకు సుపరిపాలన కలిగిన గ్రామం అనే అంశంపై ఇస్తున్న శిక్షణ రెండవ రోజు బుధవారం కొనసాగింది. గ్రామ సభల ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రణాళికలను తయారు చేసుకోవాలని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. ప్రణాళికలను పంచాయతీల్లో సమాచార బోర్డులో ఉంచాలని తెలిపారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఆర్‌టీఐ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే విధానం, సమాజంలో బలహీనమైన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించడంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ప్రభుత్వ పథకాలను శిక్షణకు వచ్చిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాకల్టీలు వి.ప్రసాద్, డీఆర్‌ఎస్ పద్మజ, ఎం చక్రపాణిరావు, కేఆర్ నిహారిక, బి. వెంకటేశ్వర్లు, బి అంజనేయులు పాల్గొన్నారు.

### రేపు దివ్యాంగుల ఉపకరణాలకు గుర్తింపు శిబిరం

**సామర్లకోట:** పట్టణ, మండల పరిధిలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు గుర్తించడానికి శుక్రవారం ఉదయం 9 గంటలకు శిబిరం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ జాస్తీ రామారావు బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాలతో ఎలిమికో సంస్థ సహకారంతో పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ భవనం ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే రాజప్ప పర్యవేక్షణలో విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలు అందజేస్తామన్నారు. ఉపకరణాలకు కనీసం 40 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్టు తప్పని సరిగా ఉండాలన్నారు. బ్యాటరీ కలిగిన ట్రై సైకిల్ పొందడానికి 80 శాతం దివ్యాంగత్వం ఉండాలన్నారు. శిబిరానికి వచ్చే వారు వారి సర్టిఫికెట్లతో పాటు ఆధార్, రేషన్ కార్డులు జిరాక్స్ తీసుకురావాలని కమిషనర్ సూచించారు.

### రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**సామర్లకోట:** మండల పరిధిలో వేట్లపాలెం, మేడపాడు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏఏఎస్‌డీ ఎస్ ప్రభాకర్ బుధవారం రాత్రి తెలిపారు. వేట్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మేడపాడు వెళ్లు 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.


### మాజీ ఎమ్మెల్యే దొరబాబు రాజీనామా

**పిఠాపురం:** మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తగిన గుర్తింపు లేనందున పార్టీని వీడుతున్నట్టు తెలిపారు. ఏ పార్టీలో చేరతాననేది నాలుగు రోజుల్లో తన నాయకులు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయించుకుంటానన్నారు.

### గొరకపూడిని కలిసిన బీజేపీ నాయకులు

**సామర్లకోట:** భారతమాత సేవాపరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొరను రాష్ట్ర బీజేపీ నాయకులు బుధవారం సాయంత్రం ఆయన స్వగృహంలో కలిసారు. ఇంటికి వచ్చిన బీజేపీ నాయకులకు గొరకపూడి స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మధుకర్, జిల్లా అధ్యక్షుడు చిరుకూరి రామ్‌కుమార్, పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కొక్కిలిగడ్డ గంగరాజు, పిఠాపురం ఇన్‌చార్జి కృష్ణంరాజు, పట్టణ అధ్యక్షుడు కాటమరెడ్డి ఏడుకొండలు, కార్యదర్శి ఏలేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొరకపూడి రాష్ట్ర నాయకుడు మధుకర్‌ను ఘనంగా సత్కరించారు.

### శిక్షసాగర్ ఫౌండేషన్ సభ్యురాలిగా పద్మజ



**కొత్తపల్లి:** గుజరాత్‌కు చెందిన శిక్షాసాగర్ ఫౌండేషన్ సభ్యురాలిగా యాళ్ళ పద్మజని నియమించారు. ఈ మేరకు శిక్షాసాగర్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి శైలేష్ కుమార్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలురు పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పద్మజ పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ పదవికి ఆమెను నియమించారు. సభ్యురాలిగా ఎంపికవడమే కాకుండా అవార్డు కూడా లభించినట్టు ఆమె తెలిపారు. సెప్టెంబర్‌లో ఈ అవార్డు అందుకోనున్నట్టు చెప్పారు, పలువురు అభినందించారు.

# గొల్లప్రోలును ముంచెత్తిన వరద

- పుష్కర కాలువకు గండి. పొంగిపొర్లుతున్న సుద్దగడ్డ
- నీట మునిగిన 200 హెక్టార్లలో వరి, పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు

**పిఠాపురం:** ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలేరు నుంచి వదిలిన అదనపు జలాలు గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు మండలంలో పలు గ్రామాలు నీట మునిగాయి. గత రెండు వారాలుగా వేసిన వరి నాట్లు, ప్రత్తి, మిరప, ఇతర వాణిజ్య పంటలు నీట మునిగాయి. సుద్దగడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు సూరంపేట వద్ద రహదారులు నీట మునిగాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఇప్పటి వరకు సుమారు 200 హెక్టార్లలో వరి, పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు వరద ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో మరింద వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగడ్డ ప్రవాహానికి లోతట్టు కాలనీలు నీట మునిగి వీధులు చెరువులుగా మారాయి. గొల్లప్రోలు సమీపంలో కొత్త కాలనీ వద్ద రహదారి పూర్తిగా జలమయమవ్వడంతో టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.


గొల్లప్రోలు సూరంపేట వద్ద వరద నీటిలో స్థానికుల ఇక్కట్లు


గొల్లప్రోలు సూరంపేట వద్ద వరద నీటిలో మంచినీటి కోసం స్థానికుల ఇక్కట్లు


గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన వరి నాట్లు


గొల్లప్రోలు కొత్త కాలనీ వద్ద పొంగిపొర్లుతున్న సుద్దగడ్డ


గొల్లప్రోలు సూరంపేట వద్ద వరద నీటిలో విద్యార్థుల ఇక్కట్లు

## ఆకర్షించే విధంగా విద్యాబోధన


విద్యార్థుల పఠనాసామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

**సామర్లకోట:** విద్యార్థులను ఆకర్షించే విధంగా విద్యా బోధన ఉండాలని స్కీమ్స్ ఎంఈఓ పి. పుల్లయ్య అన్నారు. బుధవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో 462 మంది విద్యార్థులకు 455 హాజరు కావడంపై ఎంఈఓ హర్షం వ్యక్తం చేశారు. బడికి హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి కారణాలు తెలుసుకోవాలన్నారు. ప్రతి రోజు చదవడం, రాయడం విద్యార్థులకు అలవాటు కావాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్‌పై విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇచ్చిన హోమ్ వర్కును ఉపాధ్యాయులు ప్రతి రోజు పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల సందడి

- ముందస్తు చర్యలుగా పోలీసు బందోబస్తు
- నియోజకవర్గం పరిధిలో 154 పాఠశాలల్లో ఎన్నికలు


స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలకు సిద్ధమైన ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్

**సామర్లకోట:** ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల సందడి నెలకొంది. ఈనెల 1వ తేదీన ఆయా పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం ఎన్నికలు నిర్వహించడానికి అన్ని పాఠశాలల్లోనూ ప్రధానోపాధ్యాయులు రంగం సిద్ధం చేసుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 154 పాఠశాలల్లో 15,961 మంది విద్యార్థులున్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకొని అందరూ కలిసి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో రిజర్వేషన్ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రతి పాఠశాలలో హెచ్‌ఎంల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎంఈఓ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులు, వారు లేని సమయంలో సంరక్షకుడు ఎన్నికల్లో పోటీ చేసే హక్కుతో పాటు ఓటు వినియోగించుకునే హక్కు ఉంటుంది. ఇద్దరు పిల్లలుంటే రెండు ఓట్లు వినియోగించుకోవచ్చు. పోటీ మాత్రం ఒక చోట నుంచే చేయవలసి ఉంటుందని మండల విద్యాశాఖాధికారి వై. శివరామకృష్ణయ్య తెలిపారు. ఎస్‌ఎంసీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన చెప్పారు.

**సమస్యాత్మక పాఠశాలలు ఇవే**

పట్టణ పరిధిలో బచ్చుఫౌండేషన్, యార్లగడ్డ అక్కిరాజు, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల, మండల పరిధిలో పి. వేమవరం, అచ్చంపేట, నవర, ఉండూరు, మాధవపట్నం, వేట్లపాలెం, జి. మేడపాడులోని పాఠశాలల్లో ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎంఈఓ శివరామకృష్ణయ్య తెలిపారు. పాఠశాల ఆవరణలోకి తల్లిదండ్రులు, సంరక్షకులకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఎన్నికల అయిన కమిటీ పాఠశాల అభివృద్ధి కోసం పని చేయవలసి ఉంటుందన్నారు.

### పెద్దాపురం సీఐగా క్రాంతికుమార్ బాధ్యతల స్వీకరణ



**పెద్దాపురం:** పెద్దాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.క్రాంతికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు జిల్లా జీలుగుమిల్లి సీఐగా కొనసాగుతున్న ఆయన ఇక్కడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీఐగా కొనసాగిన రవికుమార్ వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సీఐగా క్రాంతికుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2012లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గొల్లపాలెం, మండపేట, ఐ.పోలవరం, అమలాపురం టౌన్ స్టేషన్లలో ఎస్సైగా విధులు నిర్వర్తించి 2023లో సీఐగా పదోన్నతిపై జీలుగుమిల్లి బదిలీ అయ్యారు. ప్రస్తుతం పెద్దాపురం సీఐగా ఉత్తర్వులు జారీ కావడంతో ఇక్కడ సీఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

### పొలంబడిపై అవగాహన కల్పించాలి


గొర్సలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

**కొత్తపల్లి:** పొలంబడిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్ఏలదేనని మండల వ్యవసాయ అధికారి జోగిరాజు అన్నారు. గొర్సలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి ముఖ్య ఉద్దేశం రైతులకు చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించాలని గ్రామస్థాయి సిబ్బందికి సూచించారు. భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాలన్నారు. గడ్డి మందులను అధికంగా ఉపయోగించకూడదన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

**కాకినాడ సిటీ:** అధికారులు సమన్వయంతో పని చేసి కాకినాడ పోలీస్ పెరేడ్‌మైదానంలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. స్థానిక పెరేడ్‌మైదానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ కమిషనర్ భావన, రెవెన్యూ, రోడ్డు భవనాల శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. స్టేజ్ అలంకరణ, సీట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టమ్, మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా సరిచూసుకొని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, రోడ్డు భవనాల ఎస్ఈ జి.కాంతు, జిల్లా పౌరసంబంధాల అధికారి డి.నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాబూరావు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ పి.సత్య కుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ డి.పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

**నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి కార్యక్రమాలపై సమీక్ష**

స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి కార్యక్రమాలపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ షాన్‌మోహన్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి–శిక్షణ– ఉపాధి కార్యక్రమాలపై విశ్లేషించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కె.శ్రీరమణి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు పాల్గొన్నారు.

# ఈ రోడ్డులో వెళ్లేదెలా..!


కొత్తపల్లి- పండూరు రోడ్డులో వెంకటరాయపురం వద్ద గోతులుగా ఉన్న రోడ్డు


పెదకలవలదొడ్డు వద్ద గుంతల్లో చేరిన వర్షపు నీరు

- అధ్వానంగా కొత్తపల్లి-గోర్స రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- కనీసం మరమ్మతులు చేపట్టని అధికారులు

**కొత్తపల్లి:** ఎక్కడికక్కడ గుంతలు అసౌకర్యంగా ఉన్న ప్రయాణంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులతో నరకయాతన అనుభవిస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలోని కొత్తపల్లి–గోర్స రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. బీచ్‌రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు పండూరు రోడ్డులో గోర్స మీదుగా వస్తున్నారు. ఈ రోడ్డు ఎక్కడికక్కడ గోతులమయంగా మారింది. వర్షం నీరు గోతుల్లో చేరి ప్రయాణికులు ప్రమదాలకు గురవుతున్నారు. అలాగే కొత్తపల్లి–పండూరు రోడ్డులో వాకతిప్పలో ఉన్న సత్యమ్మతల్లి గుడి వద్ద, కొమరగిరి శివారు వెంకటరాయపురం వద్ద రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. కనీసం రాకపోకలకు వీలులేకుండా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.

**ప్రయాణం నరకమే..**



కొత్తపల్లి–గోర్స రోడ్డు గుంతలతో నిండిపోయింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. వర్షం పడితే ఈ రోడ్డులో ప్రయాణం నరకమే.

– కటారి శ్రీను, గొర్స

**గుంతలన్నా పూడ్చండి**



గొర్స రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంతలను కనీసం అధ/ కారులు స్పందించి పూడ్చండి. గుంతల్లో చాలా మంది పడిపోతున్నారు. పలువురు గాయపడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చాలి.

– ఎస్.సత్తిబాబు, గొర్స

## భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం


చెరువుగా మారిన సామర్లకోట బస్సు కాంప్లెక్స్

**సామర్లకోట:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడుగా బుధవారం సుమారు రెండు గంటల పాటు కుంభ వృష్టిగా భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పల్లపు ప్రాంతాలు జలమయమై జన జీవనం స్తంభించింది. ఆర్టీసీ కాంప్లెక్స్ చెరువుగా మారింది. రైల్వే స్టేషన్, జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, దేవిచౌక్, సంపెంగతోట, వీర్రాఘవపురం, సీతాఫలదొడ్డి, బ్రౌన్‌పేట, సత్యనారాయణపురం, సంపెంగ తోట, భాస్కర్‌నగర్ నీటిలో మునిగాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రెయిన్లను మూసివేస్తూ స్లాబ్‌లు వేయడం వల్ల వర్షపు నీరు డ్రెయిన్‌లోకి ప్రవహించే అవకాశం లేక పోవడంతో రోడ్లు చెరువులుగా మారుతున్నాయి. వీటిని అధికారులు గమనించి కూడా మౌనంగా ఉండటంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. వీకే రాయపురం, ఉప్పువారి సత్రం వద్ద ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో పొలాల్లోని ముంపు నీరు కిందికి వెళ్లే మార్గం లేదని ఆ ప్రాంత రైతులు అంటున్నారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో 22,500 ఎకరాల్లో వరి సాగుపూర్తి చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెప్పారు. వీటిలో వెయ్యి ఎకరాల వరకు వరద ముంపులో ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

## మద్యం మహమ్మారిని తరిమికొట్టండి


దోబగుంట రోషమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కమిటీ సభ్యులు

**పిఠాపురం:** మద్యపాన వ్యతిరేక ఉద్యమ సారథి దోబగుంట రోషమ్మకు గొల్లప్రోలు ఎస్సీ కాలనీ సామాజిక భవనంలో జన విజ్ఞాన వేదిక మద్యపాన వ్యతిరేక ప్రసార కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రామిక మహిళలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ ఎస్.సూర్యనారాయణ పాల్గొని ఆమె చిత్ర పటానికి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపాన వ్యతిరేక ఉద్యమ సారథి దోబగుంట రోషమ్మ తన స్వగ్రామం దోబగుంట నుంచి ప్రారంభమైన సారా వ్యతిరేక ఉద్యమం వెల్లువలా విస్తరించడంతో ఆమె పేరు దోపగుంటగా స్థిరపడిందన్నారు. సారాకు అలవాటు పడ్డ కుటుంబ సభ్యుల నుంచి ఎదుర్కొన్న గృహహింసలు మారే మహిళకు రాకూడదని అక్షర దీపం కార్యక్రమంలో తాను చదివిన సీతమ్మ కథ ద్వారా స్ఫూర్తి పొంది సారా వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 1991లో ప్రారంభమైన ఈ సార వ్యతిరేక ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించి తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన ఎన్టీ రామారావు తొలి సంతకం సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయడానికి బాటలు వేసిందన్నారు. జన విజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల అధ్యక్షుడు నాని బాబు మాట్లాడుతూ మద్యం మహమ్మారిని తరిమి కొట్టాలంటే దోబగుంట రోషమ్మ స్ఫూర్తి నింపుకొని సంపూర్ణ మద్యపాన నిషేధానికి కృషి చేసినప్పుడే రోషమ్మకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాగం సూకరత్నం చెల్లి శోభ ఛిజి కళావతి గుడాల శేషు పాల్గొన్నారు.

## పైపులైన్ మరమ్మతులకు అంతరాయం


డ్రెయిన్‌లో పైపులైన్ మరమ్మతు పనులు ప్రారంభించిన సిబ్బంది

**సామర్లకోట:** స్థానిక జయలక్ష్మీ థియేటర్ వెనుక భాగంలో ఉన్న డ్రెయిన్‌లో పూడికతీత సమయంలో పైపులైన్ ధ్వంసం కావడం, సత్యనారాయణపురం ప్రాంత ప్రజలకు తాగునీటికి అంతరాయం ఏర్పడిన విషయం విదితమే. లోపాన్ని గుర్తించేందుకు మూడు రోజుల సమయం పట్టింది. రెండు రోజులు సామగ్రి లేదని కాలక్షేపం చేశారు. సామగ్రి రావడం , పైపులైన్ లోపం గుర్తించి పనులు చేయడానికి ఐదు రోజులు గడిచినా పనులు మాత్రం పూర్తి కాలేదు. పనులు ప్రారంభిస్తున్న సమయంలో వర్షం రావడంతో పనులకు అంతరాయం ఏర్పడుతుందని ఇంజనీరింగ్ శాఖ అధికారులు చెప్పుతున్నారు. బుధవారం ఉదయం పనులు ప్రారంభించగా సుమారు రెండు గంటలు వర్షం కురిసింది. దీంతో పనులు నిలిపి వేశారు. డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు వేసి మోటార్లతో నీరు తీసి వేసి పైపులైన్ మరమ్మతులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ జె.రామారావును వివరణ కోరగా గురువారం ఉదయం దగ్గర ఉండి పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. పైపులైన్ పనులు పూర్తయ్యే వరకు ట్యాంకరు ద్వారా నీరు సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.

## స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా

- కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి కిషోర్


లింగ నిర్ధారణపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిషోర్

**కాకినాడ సిటీ:** గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టినట్లు కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో కిషోర్ వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడ శిశువుపై వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతోపాటు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన మొత్తం 111 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, దీనిలో 11 ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉన్నాయన్నారు. ఏప్రిల్ నెల నుంచి జూలై వరకూ 2 డెకాయి ఆపరేషన్లు నిర్వహించగా 106 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు ఆర్డీవో కిషోర్ తెలిపారు. డీఐవో డాక్టర్ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ఏదైనా స్కానింగ్ సెంటర్లో అవకతకలు గుర్తించిన యెడల టోల్ ఫ్రీ నంబర్ 1800 425 33665కు తెలియజేయాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ న్యూరిష బేగం, కాకినాడ, పెద్దాపురం, తాళ్లరేవు సీడీపీవోలు జి.ఉష, ఎ.జ్యోతి, డి.సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.పద్మశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్స్ పి.సత్యవతి, మానిటరింగ్ కన్సల్టెంట్ ఎల్.శృతి, ఒ.వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఏ తదితరులు పాల్గొన్నారు.